
# మహానగరం కథలు
## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# పెళ్ళంటే?

"**అమ్మా**, నాదో మాట విని ఈ వ్యవహారాలన్నీ కొన్నాళ్ళు ఆపేద్దాం, ప్లీజ్" అన్నాడు విశాల్ కొద్దిగా విసుగు, అసహనం మిళితమైన స్వరంతో.

" ఇంతగా అందరికీ చెప్పి చూస్తూ ఉంటేనే ఏదీ కుదరడం లేదు, అలాంటిది కొన్నాళ్ళు ఆపేయడమా? నీకప్పుడసలు పెళ్ళే కాదు" అంది ఇందిర గబగబా.

" కాకపోయినా నష్టం లేదు కానీ ఈ అమ్మాయిలని చూస్తుంటే నాకు పెళ్ళి కాదు కదా, జీవితమంటేనే విరక్తి వస్తోంది. అమ్మా, దయచేసి నేను చెప్పేది అర్ధం చేసుకో! ఐ యాం టైర్డ్" అన్నాడు విశాల్ చిరాగ్గా.

విశాల్ ఇందిర, ప్రతాప్ ల ఒక్కగానొక్క కొడుకు. చక్కటి కుర్రాడు. ఎం.బి.యే చేసి పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఇరవై ఏడు నిండగానే ప్రతాప్ అడిగాడు కొడుకుని.

" నాన్నా, పెళ్ళి అనేది పూరిగా నీ నిర్ణయం. నీకెలా నచ్చితే అలాగే చెయ్యడానికి నేనూ, మీ అమ్మా రెడీగా ఉన్నాము. నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పు, వెళ్ళి మాట్లాడదాం లేదంటే మనం వేరే ప్రయత్నాలు చేద్దాం. అది కూడా నీకునచ్చినప్పుడే, చేసుకోవాలనిపించినప్పుడే. మా దృష్టిలో ఇది సరైన వయసు కనక ఇప్పుడు చెప్తున్నాను" అన్నాడు నెమ్మదిగా..

"థాంక్స్ నాన్నా, తప్పకుండా, మీరన్నట్టే చేద్దాం!" అన్నాడు విశాల్ కూడా.

మొదటినించీ ప్రతాప్ తత్వమే అంత. మంచి, చెడు చెప్పి అవతలివారినే నిర్ణయించుకోమంటాడు. అలా చేస్తే వారికి తగిన గౌరవం ఇచ్చినట్టని అతని భావన.

విశాల్ ఎం.బి.యే పూర్తయ్యాకా అతను తన బిజినెస్ లో ప్రవేశిస్తే బావుంటుందని అనుకున్నాడు. అందుకే విశాల్ కి అన్నీ వివరించి చెప్పాడు, 'ఆపైన నిర్ణయం నీదే!' అన్నాడు. కొడుకు కొన్నాళ్ళు మరో కంపెనీలో ఉద్యోగం చేస్తాను, ఆపైన చూద్దాం అంటే ఆనందంగా సరే అన్నాడు.

ఇందిర మాత్రం 'హాయిగా మన కంపెనీలోనే చేరచ్చు కదా, ఎవడి దగ్గరో చాకిరీ ఎందుకు?' అని గొడవ చేసింది మొదట కానీ విశాల్ ఆలోచన తెలిసాకా తన అభిప్రాయాన్ని మార్చుకుంది.

అలా పరస్పరం ఒకరి అభిప్రాయాలని మరొకరు గౌరవించుకుంటూ హుందాగా ఉంటారు ముగ్గురూ..

తన మనసులో ఎవరూ లేరని, అమ్మా నాన్నలకిష్టమైన సంబంధం చూస్తే, తనకీ నచ్చితే వివాహం చేసుకోవడానికి అభ్యంతరం లేదని తన ఇరవై ఎనిమిదవ పుట్టినరోజున చెప్పాడు విశాల్.

తన మనసులో ఎవరూ లేరని, అమ్మా నాన్నలకిష్టమైన సంబంధం చూస్తే, తనకీ నచ్చితే వివాహం చేసుకోవడానికి అభ్యంతరం లేదని తన ఇరవై ఎనిమిదవ పుట్టినరోజున చెప్పాడు విశాల్.

ఒక్కడే కొడుకు, చక్కటి ఉద్యోగం, ఆపైన స్వంత వ్యాపారం, తమది ఎంతో మంచి కుటుంబం.. వెంటనే పెళ్ళి కుదిరిపోతుందని ఆశపడిన ఇందిరకి ఆశాభంగమే ఎదురయింది. ప్రయత్నాలు మొదలుపెట్టి సంవత్సరం దాటుతున్నా ఎక్కడా ఒక కొలిక్కి రాకపోవడంతో.

పైగా విశాల్ ఇప్పుడిలా అనడంతో ఆవిడకి మరింత కంగారు వేసింది. ముప్పై ఏళ్ళువచ్చేస్తున్నాయి, ఇప్పటిదాకా కుదరనేలేదు పైగా వీడిలా అంటాడేమిటి? అనుకుంది. గట్టిగా కొడుకుతో అనలేదు కానీ..

ఆరోజు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన ప్రతాప్ తో ఆ మాటే అంది.

"పోనీలే ఇందూ.. వాడి మాట కాదనడం ఎందుకు? అలాగే చూద్దాం" అన్నాడు..

" మీకలా తేలిగ్గా ఉంటుంది. మొన్న నా స్నేహితురాలు అరుణ అంది కూడా, అబ్బాయిలకి ముప్పై దాటితే ఆ వచ్చే నాలుగు సంబంధాలు కూడా రావని. ఆడపిల్లలు వాళ్ళని ముసలాళ్ళు అంటున్నారని" అంది చిరాగ్గా..

" నువ్వు కూడా అలా అంటావేమిటి ఇందూ! అలా అని మంచీ మర్యాదా లేకుండా మాట్లాడేవాళ్ళతో ఎలా? నీకు తెలీదు నాకెలాంటి అనుభవాలెదురయ్యాయో? అవి తలుచుకుంటేనే చిరాకు. వాడికేం ఎదురయ్యిందో ఇలా అన్నాడంటే?" అన్నాడు, తన అనుభవాలని గుర్తు చేస్తుకుంటూ.

" హలో! ఆ, ఒకే.. ఏమిటో చెప్పండి" అటువైపు ఫోన్ లో మాట్లాడినతని గొంతు, పలకరించిన తీరు విని కొద్దిగా ఆశ్చర్యపోయాడు ప్రతాప్.

"నాపేరు ప్రతాప్ అండి, మా అబ్బాయి విశాల్ కోసం సంబంధాలు చూస్తుంటే మీ అమ్మాయి నమ్రత గురించి చెప్పారు తెలిసినవారు. అందుకని మీతో ఒకసారి మాట్లాడదామని" అన్నాడు ప్రతాప్.

"ఓహో అలాగా! ఇప్పటికే మా అమ్మాయికి మూడు నాలుగు సంబంధాలున్నాయి. మీ వివరాలు ఎస్.ఎం.ఎస్ చెయ్యండి, చూసి నచ్చితే మెసేజ్ చేస్తా, అప్పుడు మళ్ళీ కాల్ చెయ్యండి" అన్నాడు అవతలాయన..

"అమెరికాలో ఎక్కడుంటాడు మీవాడు?" అన్నాడు ఫోన్ పెట్టేస్తూ.. అప్పటికే ఆయన ధోరణికి విసుగొచ్చిన ప్రతాప్ ఫోన్ పెట్టేశాడు.

ఇలాంటివి, ఇంతకంటే అమర్యాదగా మాట్లాడిన అనుభవాలు మరికొన్ని ఎదురవ్వడంతో

' ముందు పిల్లలిద్దరినీ మాట్లాడుకోమందాం, ఆపైన ఉభయులకీ నచ్చితే ముందుకు వెళ్ళవచ్చు ' అనుకుని ఇందిరతో అదే మాట చెప్పాడు.

ఇప్పుడు ఇందిర అదే మాట అంది. " అచ్చు మీలాగే వాడు చేస్తున్నాడు. పిల్లల తల్లితండ్రులు మాట్లాడేది నచ్చక మీరు వదిలేశారు, ఇప్పుడు వాడూ అంతే. ఇలా అయితే ఎలా?" అంది..

ప్రతాప్ మాట్లాడలేదు. మౌనంగా అన్నం కలుపుకుంటూ ఉండిపోయాడు.

" ఏమయిందో వాడినోసారి అడగండి, ఆపైన ఏంచెయ్యాలో చూద్దాం" అంది చివర మాటగా.

" ఊ" అన్నాడు ప్రతాప్.

మరో రెండు రోజుల తర్వాత విశాల్ తో నెమ్మదిగా ఆ విషయాన్ని కదపడానికి ప్రయత్నించాడు. కొడుకు ముఖంలో కనిపిస్తున్న చిరాకుని చూస్తే అతనికి ఎందుకో జాలి వేసింది.

తన వేలుపట్టుకుని జీవితాంతం నడిచే సహచరిని వెతుక్కునే కార్యక్రమం ఇంత ఇబ్బందికరంగా మారడం తలుచుకుంటే అతనికి బాధగా అనిపించింది.

" ఏరా నాన్నా, మరికొన్నాళ్ళు ఆగుదాం అన్నావుట కదా, నచ్చిన అమ్మాయి దొరికినప్పుడే మాట్లాడదాం!" అన్నాడు.

విశాల్ మాట్లాడలేదు. తన ఫోన్ వైపు చూసుకుంటూ ఉండిపోయాడు.

" పోనీ నీకేమైనా ప్రత్యేకమైన ఇష్టాలుంటే చెప్పు, వాటికి సరిపోయే అమ్మాయిలనే చూద్దాం. అందరినీ ఇబ్బంది పెట్టకుండా" అన్నాడు ప్రతాప్.

" అదే నాన్నా, నా అభిప్రాయం కూడా, మీకు తెలీనిదేముంది?. ఇప్పటికి నలుగురితో మాట్లాడాను. నాకు నచ్చడం కాదు, వాళ్ళకి ఏం నచ్చుతుందో? అంచనా వెయ్యలేకపోయాను" అన్నాడు కోపంగా.

" అదేమిటి? ఏమయింది?" అంది ఇందిర.

" నువ్వు వాళ్ళతో మాట్లాడితే తెలుస్తుందమ్మా, వారి రూపాలకి, వేషధారణకి, అభిప్రాయాలకీ పొంతనే లేదు ఎక్కడా. ఒకరికి నేను ఇంజనీర్ కాదని నిరాశ., మరొకరికి నేను అమెరికా వెళ్ళనేమో అన్న సంశయం..

తమ కజిన్స్, స్నేహితులు లేదా తెలిసిన వాళ్ళు ఎలా ఉంటే తాము కూడా అలాగే ఉండాలనుకోవడం తప్ప తమకంటూ ఒక అభిప్రాయం ఉండాలని లేనే లేదనిపించింది వాళ్ళని చూస్తే.

నీకు, నాన్నకి పెళ్ళయ్యి ముప్పై సంవత్సరాలవుతోంది, ఆరోజుల్లోనే నువ్వు ఆలోచించినంతగా కూడా వీళ్ళు ఆలోచించలేరా? అనిపిస్తుంది..

అధునాతనమైన వేషధారణ, సరికొత్త ఫోన్ లు, హోటల్లు, సినిమాలు.. ఇంతేనా ప్రపంచం? "

కొడుకు మాటల్లోని సత్యాలు తనకీ తెలుసు. ఒకరిని అనలేని కాలం ఇది. పెళ్ళి అనగానే ఈ రకమైన వరుడే ఉండాలని, ఇలాంటి వేడుకగానే జరగాలని ఈ తరం వాళ్ళు అనుకుంటున్న రోజులు ఇవి.

అదే మాట అంది పైకి..

"వాళ్ళ తప్పులేదులేరా కన్నా, రోజులలాగే ఉన్నాయి. డిజైనర్ బట్టలు, దివిటీలైట్లు, ఫోటోలు, విడియోలు.. ఇవే పెళ్ళి అనుకుంటున్నారు.." అంది నెమ్మదిగా

"దానితో కూడా నాకు పేచీ లేదమ్మా, అన్నీ నచ్చితే అందరికీ ఎలా నచ్చితే అలా చెయ్యవచ్చు. పెళ్ళంటే రెండు కుటుంబాల కలయిక అని, అది జీవితాంతం వారి మధ్య కొనసాగబొయే బంధం అని తెలుసుకోలేకపోవడంతోనే నాకు సమస్య" అన్నాడు కోపంగా..

ఆమాటన్నప్పుడు ఎర్రబడిన అతని ముక్కుని చూసి గ్రహించాడు ప్రతాప అతని మనసు గాయపడే సంఘటన ఏదో జరిగిందని..

" పోనీలే విశాల్, తర్వాత చూద్దాం" అంటూ వాతావరణాన్ని తేలికపరచబోయాడు.

" పెద్ద పెద్ద సిటీల్లో పుట్టారు, పెరిగారు. అల్ట్రా మోడర్న్ గా ఉంటారు.. భావాలు మాత్రం ఇంత పాతచింతకాయ పచ్చడి లాంటివా? నన్ను, నా తల్లితండ్రులని గౌరవించలేని అమ్మాయిలని నా జీవితంలోకి ఎలా ఆహ్వానించగలను?" అన్నాడు విశాల్.

అతని మనసులో తనకి అన్ని విధాలా నచ్చిన శ్వేత తో జరిగిన సంభాషణే మెదులుతోంది.

"అమ్మాయి బావుందిరా, నాకూ, నాన్నకీ కూడా ఫోటో బాగా నచ్చింది. నువ్వు కూడా చూసి ఒకసారి ఇద్దరూ మాట్లాడుకోండి. ఈ అమ్మాయి నీకు తప్పక నచ్చుతుందనే నా విశ్వాసం" అంది ఇందిర రెండు రోజుల క్రితం..

తల్లి మాట ప్రకారం ఆ అమ్మాయి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు. మూడు బెడ్ రూముల ఫ్లాట్, సాధారణం గా ఉంది, మరీ హడావిడులేమీ లేకుండా.

" రా, అమ్మా, నాన్నా సినిమాకెళ్ళారు" అంది శ్వేత తలుపు తీసి విశాల్ ని ఆహ్వానిస్తూ..

" మీరొక్కరే ఉన్నారన్నమాట!" అన్నాడు విశాల్. ఆ అమ్మాయి చనువుని గమనిస్తూనే.

" మీరేంటి, మీరు? ఏదో అమ్మమ్మని పిలిచినట్టు." ఉడుక్కుంది.

ఆ తర్వాత తనకిష్టమైన సినిమాలు, ఫోన్ లు లాంటివాటిగురించి చెప్పడం, తన స్నేహితులు, కజిన్స్ అంటూ ఫోటోలు చూపించడం మొదలు పెట్టింది

" కొంచం మంచినీళ్ళు!" అన్నాడు.

" మంగా, మంచినీళ్ళు తెచ్చియ్యి" అంది గట్టిగా.. ఆ మంగన్న అమ్మాయి ట్రేలో నీళ్ళగ్లాస్ తో వచ్చింది. " టీ తాగుతారా సార్? అంది..

' పరవాలేదు, కనీసం ఈ అమ్మాయికి మర్యాద తెలుసు ' అనుకున్నాడు

" నువ్వు ఇక్కడే ఉంటావా?" అంది శ్వేత హఠాత్తుగా.

" భోజనానికా? లేదు. కొంతసేపు కలిసి వెళ్ళిపోదామని వచ్చాను" అన్నాడు ఆమె అన్నది అర్థం కాక..

" ఛా, అది కాదు నేనన్నది, ఈ ఊర్లోనే ఉంటావా? అని"

" ఉద్యోగం ఇక్కడే, మా ఇల్లు ఇక్కడే, అమ్మా, నాన్నా ఇక్కడే. ఇక్కడ కాక ఎక్కడుంటాను?" అన్నాడు.

" అనుకున్నాలే, ఒక్కడివే కదా, అమ్మా, నాన్నల కూచివని" విసురుగా అంది..

గాయపడినట్టు చూశాడు.. 'నాకర్థం కాలేదు ' అన్నాడు నెమ్మదిగా..

"అర్థం కాకపోవడానికేముంది? మా అమ్మ ముందే అంది. అబ్బాయి బాగున్నాడు, జాబ్ కూడా బావుంది. కానీ ఒక్కడే కదా, తల్లితండ్రుల బరువంతా ఇతని మీదే ఉంటుంది అని" అంది..

" మీరూ ఇద్దరూ ఆడపిల్లలే కదా, మీ అమ్మా, నాన్నలనీ వచ్చే అల్లుళ్ళేచూసుకోవాలి కదా!" అన్నాడు ఫెళ్ళునపుల్ల విరిచినట్టు మాట్లాడుతున్న ఆ అమ్మాయిని చూస్తూ.

" నిజమే, అది మా చెల్లి కి వచ్చేవాడు చూసుకునే ఛాన్స్ కూడా ఉంది, నీ విషయంలో అలా కాదుగా? మరో ఆప్షనే లేదుగా.. " అంది పెద్ద లాజిక్ కనిపెట్టినట్టు..

ఒక్క క్షణం మాట్లాడలేకపోయాడు..

అప్పటివరకూ తాము, తమ కజిన్స్ ఎంత క్లోజ్ గా ఉంటారో ఫోన్ లోనూ, ఆల్బం లోనూ ఫోటోలు చూపించి చెప్పిన అమ్మాయి తను వెళ్ళబోయే కుటుంబం పట్ల కనపరుస్తున్న తీరు అతన్ని విస్మయానికి గురి చేసింది.

"కాకపోవచ్చు. కానీ దానికేముంది?" అన్నాడు నెమ్మదిగా.

"ఏముందా? అందుకే మా కజిన్ ఒకర్తి క్లియర్ గా చెప్పేసింది చూసుకోవడానికొచ్చిన అతనితో. పెళ్ళి అయ్యాకా అమెరికా తీసుకువెళ్తేనే పెళ్ళి అని. మరో ఫ్రెండ్ అయితే ఇంకా చాలూ, అస్సలు మొహమాటమే లేదు దానికి.. ఏమందో తెలుసా అబ్బాయితో? మీ అమ్మా నాన్నలు మంచిగా ఫోటోల్లో గోడమీద ఉండేటట్టయితే నేను రెడీ పెళ్ళికి అంది" నవ్వుతూ అదేదో పెద్ద జోక్ లా చెప్తున్న ఆ అమ్మాయిని చూస్తే కోపం రావలసింది జాలి వేసింది..

అవునమ్మా జాలి.." ఇలాంటిభావాలతో ఎలా పెరిగారు వీళ్ళు? రేపు వీళ్ళు అమ్మలయితే ఎలాంటి భావాలతో పిల్లలని పెంచుతారు? " అని

కజిన్ ల మీదా, స్నేహితుల మీద పెట్టి ఎంతో తెలివిగా నాకు తన మనసులో భావాన్ని చెప్పిన అమ్మాయి మీద చిత్రంగా నాకు కోపం రాలేదు కానీ బాధగా అనిపించింది."

"ఆ అమ్మాయికి మెచ్యూరిటీ లేదు, కొన్నాళ్ళు పోతే తెలుసుకుంటుంది అని నువ్వు అనచ్చు, కానీ అసలు వీళ్ళ ఆలోచనా విధానంలోనే ఏదో తేడా ఉందనిపించిందమ్మా..

నలుగురిదీ ఇంచుమించు ఇదే తీరు..నేను ఎక్కువ ఆలోచిస్తున్నానేమో తెలీదు కానీ ఇవన్నీ ఎందుకో నా వల్ల కావడం లేదు. పెళ్ళంటే ఇంతేనా? అనిపిస్తోంది. ఇంతా చేశాకా ఎన్నాళ్ళు స్థిరంగా ఉంటాయో తెలీని పరిస్థితి. దేరీజ్ సంథింగ్ రాంగ్ సం వేర్. అందుకే కొన్నాళ్ళు ఆగుదాం, ఆపైన చూద్దాం. ఈ రకమైన ఆలోచనా ధోరణికి నేను ప్రిపేర్ అవ్వాలి కదా కనీసం, లేకపోతే ఇన్ని షాక్ లు తట్టుకోవడం నా వల్ల కాదు. ఇంతకన్నా ఏం చెయ్యాలో నాకు తెలీడం లేదు."

నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళ్తున్న కొడుకుని చూస్తూ ఉండిపోయారు ఇందిరా, ప్రతాప్.

●●●